# రైతుబంధుతో రంది తీరింది

రైతులను అరిగోస పుచ్చుకున్న కాంగ్రెస్.. కరెంటు కోతలతో అన్నదాతను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టేసింది. దశాబ్దాలుగా తిష్టవేసిన ఈ దుస్థితిని తరిమి కొట్టేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో రైతుబంధు పథకానికి శ్రీకారంచుట్టారు. ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు 11విడతలుగా 67 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.72.19 కోట్లు జమచేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. రైతుబంధును కాపీకొట్టి కేంద్రం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి'ని తీసుకొచ్చింది.

**ముందుకు పోదామా! ఎన్కకా!!**

**నా పేరు** అజ్జం సాయిబాబా. నాకు నిజాంసాగర్ మండలం గోర్గల్‌లో నాలుగున్నర ఎకరాల పొలమున్నది. మునుపు పంటకు పెట్టుబడి అంటేనే గగనమైతుండె. అప్పు పుట్టక బంగారం తాకట్టు పెడ్తుంటిమి. సావుకారి ఇంటికాడ కాపలా కాస్తూ అప్పుల కోసం ఎదురు చూసేటోళ్లం. వానలు సక్కగ పడ్డప్పుడు అప్పు పుట్టకపోతుండే! కార్తెలన్నీ కర్సయిపోతుండే. ఆరిద్రలో అడ్డెడు ఇత్తనాలు చల్లుదామన్నా.. పైసలు ఉండకపోవు. పంటకాలం కండ్లముందే కరిగిపోతుండె!! సావుకారు దయతలిచి పైసలిచ్చే యాల్లకు మబ్బులు తేలిపోతుండే! తెలంగాణ అచ్చినాంక కాలం బాగైతున్నది. వానలు మస్తుగ పడ్తున్నయి. పంట పెట్టుబడి కోసం రంది పడకుండ రైతుబంధు పైసలొచ్చి బ్యాంకుల పడ్తున్నయ్. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దమనసుతోనే గిది సాధ్యమైంది. రైతుల బతుకులు మారినయ్. పెట్టుబడి పైసలు పడంగనే నాట్లు షురు చేస్తున్నం. నా నాలుగున్నర ఎకరాలకు ప్రతి ఆనకాలం, యాసంగి పెట్టుబడి కోసం రూ.22,500 నా ఖాతాలో పడ్తున్నయ్. ఆ పైసలతోనే పంట సాగు జేస్తున్నా. సంతోషంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న. సారు మళ్లొస్తే ఎకరానికి పదహారు వేలు ఇస్తనంటుండు. ఆయన మాటిచ్చిండంటే.. పక్కా చేస్తడు. రైతుబంధు ఇస్తనని ఎన్నికల్లో చెప్పకున్నా... ఇచ్చిన గొప్ప మనిషి కేసీఆర్. మా రైతులంతా ఆయన వెంటే ఉంటం.

• అజ్జం సాయిబాబా, గోర్గల్, నిజాంసాగర్



హైదరాబాద్ | శుక్రవారం 24 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com



## రైతుబంధు సువర్ణాధ్యాయం

రైతుబంధు పథకం సామాన్యమైనది కాదు. భారతదేశ రైతాంగ చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయం. దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నం. యావత్తు దేశానికే తెలంగాణ దిక్సూచిగా నిలుస్తున్నది. 12,000 కోట్ల రూపాయలు బాజాప్తాగా బడ్జెట్‌లో కేటాయించి శాసనసభలో బిల్లు పాసు చేయించి సగర్వంగా నేడు రైతుల చేతుల్లో పెడ్తున్నం. దేశం మొత్తంలో ఏ రాష్ట్రం కూడా ఇలా చేయట్లేదు. మనమే శ్రీకారం చుట్టినం. ఆ గౌరవం తెలంగాణ ప్రభుత్వానిది, తెలంగాణ రైతులది.

▪ కేసీఆర్

### వాహ్ క్యా బాత్ హై

## చెయ్యెత్తితే.. జై కేసీఆరే!




**ప్రచార** పర్వంలో నోరు జారడం కామన్. ఓ పార్టీ నుంచి మరోపార్టీలోకి వెళ్లిన జంప్ జిలానీలు పుసుక్కున పాత పార్టీకి జైకొట్టడం ఎన్నికల సిత్రాల్లో మామూలే! కానీ, ఈ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గమ్మతుంది. రోడ్ షోలు, పల్లె యాత్రల్లో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులకు చెయ్యెత్తి జైకొట్టక తప్పడం లేదేమో! ఐదేండ్ల కిందటో, పదేండ్ల కిందటో ప్రచారానికి తిరిగిన ఊర్లకు ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం తిరుగుతున్నారు. ఈ కాస్త కాలంలో గ్రామాల రూపురేఖలు మారడం చూసి కేసీఆర్‌ను తలుచుకోకుండా ఉండలేకపోతున్నారని పబ్లిక్ టాక్! ఊరి పొలిమేర్లలో కనిపిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలను చూసి 'అమ్మా.. ఇవన్నీ భలే కట్టారే?' అని మనసులోనే అనుకుంటున్నారు కావచ్చు. ఊర్లల్లో ప్రతి గల్లీకి సీసీ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా అందంగా కనిపిస్తున్న మొక్కలను చూసి 'ఊర్లు చాలా మారినయ్ కదా' అని లోలోపల ఆశ్చర్యపోతున్నారట. ఇంటింటికీ నల్లా చూసి.. ఆ గల్లీలోకి వెళ్లడానికి జంకుతున్న కాంగ్రెస్ నేతలు.. అంతరంగంలో మాత్రం కేసీఆర్‌కు జేజేలు పలుకున్నారల్లే ఉన్నది. అయితే, ఇవేమీ బయటికి మాత్రం చెప్పలేరాయె. కానీ, ఎక్కడో ఒక దగ్గర మనసులోని మాట బయటపడుతుంది కదా! మొన్న అదే జరిగింది. పాలకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యశస్వినిరెడ్డి విషయంలో అదే జరిగింది. నియోజకవర్గంలో ఓ రోడ్ షోలో ప్రసంగించిన ఆమె.. చివరిగా 'జై కేసీఆర్' అని గట్టిగా నినదించారు. పొరపాటున అన్నారులే అనుకోవడానికి.. ఆమె గతంలో ఎన్నడూ బీఆర్ఎస్‌లో పని చేసిందీ లేదు. రాజకీయాల్లోకి కొత్త కూడా! అందుకే, కండ్ల ముందున్న అభివృద్ధిని చూసి ఉన్నమాట అనకుండా ఉండలేకపోయారని ఓటర్లు భావిస్తున్నారు.

• వరుణ్

### ఖుల్లం ఖుల్లా



ఆకలికేకల రాజ్యం మీ 'చే'వ్రాలు
అన్నదాత చావులు మీరిచ్చిన ఫలాలు
సుభిక్షంగా ఉన్నదీ నేటి తెలంగాణం
కుట్రలు చేశారో తరుముతాం అందరం

కట్టలున్నాయన్న మిడిసిపాటు కాంగ్రెస్‌ది
కట్టాలు తీరాయన్న సంతృప్తి మాది
నయవంచన, నాటకాలు ఖుల్లంగా మీ నైజం
ఓటుతో మీ నోళ్లకు తాళం వేస్తాం.. ఇది నిజం

...✍ దండమూడి శ్రీచరణ్



# తెలంగాణ శాన మారింది!

ఫణికర మల్లయ్య తెలంగాణలో ఈ పేరు తెలియని వారు ఉండరు. కరడుగట్టిన సమైక్యవాది చంద్రబాబును ఆయన కడిగేసిన తీరు ఇప్పటికీ, ఎప్పటికీ మర్చిపోం. 'మా తెలంగాణ మాకిత్తె మా బతుకేదో మేం చూస్కుంటం' అని గళమెత్తి నినదించాడు. ఆ మాట అన్నానాడు తెలంగాణ వస్తే తన బతుకు ఎలా ఉంటుందోనని ఊహించుకున్నాడో.. అంతకన్నా బాగుందని ఇప్పుడు చెబుతున్నాడు. 'తుమ్మలు మొలిచిన కాల్వల్లో... నీళ్లు దుంకుతున్నయ్! పడావు పడ్డ పొలాల్లో.. పంటలు పండుతున్నయ్..' అని చెబుతున్న వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన ఫణికర మల్లయ్యను 'నమస్తే తెలంగాణ' పలకరించింది. ఆ విశేషాలివి..

- కేసీఆర్ వల్లే రాష్ట్రం బాగువడ్డది
- కాంగ్రెస్ హయాంలో అన్నీ కష్టాలే
- కాలే మోటర్లు.. పేలే ట్రాన్స్‌ఫార్మర్లు
- కాంగ్రెసొస్తే మళ్లీ నరకమే

## • ఫణికర మల్లయ్య మాట ఇది

**పదిహేనేండ్ల కిందట చంద్రబాబును నిలదీశారు కదా! అసలు ఆ రోజు ఏం జరిగింది?**

**గప్పట్ల** చంద్రబాబు ఓ సారి మా రాయపర్తికి వచ్చిండు. నేను, ఇంక శానమంది కూలీలం కల్లం కాడ పనిచేసుకుంటున్నం. ఇంతల మందీమార్బలంతో చంద్రబాబు మా తానికొచ్చిండు. 'మీలో ఎవరైనా మాట్లాడతారా?' అని అడిగిండు. నేను మాట్లాడతనన్న. 'ఏం కావాలని' అడిగిండు. 'ఏమున్నదయ్యా మా తెలంగాణ మాకిత్తె మా బతుకేదో మేమే చూసుకుంటం' అని చెప్పిన. గింతే జరిగింది. తెలంగాణ వచ్చినాంక నిమ్మలమైన.

**తెలంగాణ 2014 ముందు ఎలా ఉండే? ఇప్పుడెలా ఉన్నది?**

**గప్పటికీ,** గిప్పటికీ జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉన్నది. అప్పుడేం ఉండే.. కరువు తప్ప! నీళ్లుండేవా కాదు. బాయిల నీళ్లు పాతాళంలోతు పోతుండే. బోర్లు పడకపోయేది. యాడనో ఓ చోట బోరువడ్డా.. జల మధ్యలనే ఆగిపోవు. కరెంటు ఎప్పుడొస్తదో తెల్వకపోవు. రాత్రి బాయికాడ పంటుంటిమి. ఓ రాత్రి కరెంటు అచ్చిందని మోటర్ చాలు చేసినమో లేదో.. మళ్లీ పోయేది. నెలకోపారి మోటర్ కాలిపోతుండె! పారిన మడే పారుడు.. ఎన్క చేలు తడందక ఎండుడు! దేవునికి మొక్కి మక్క జొన్న, జొన్న, పత్తి గిట్ల వానలకు పండే పంటలనే ఏసేటోళ్లం.

**అప్పుడు చెరువుల కింద వ్యవసాయం ఎలా ఉండేది?**

**కాలం** సక్కగైతే.. చెరువు నిండంగనే కట్ట తెగిపోతుండే! రెండు దినాలల్ల చెరువు వట్టిపోతుండె! గిప్పుడున్నట్టు చెర్లు గప్పుడు ఏమున్నయ్. తాంబాలమంత ఉంటుండే! పూడిక తీసేటోడేడి? చెరువు నిండా తూటి పొదలే! కాలం తీరు వానలు వడ్తే.. చెరువు కింద దొడ్డొడ్లు పండించేటోళ్లం. అప్పట్లో జనాలకు పొద్దున తింటే మాపటికి ఉండకపోవు. గట్క దొరుకుడు గిన కష్టమే ఉంటుండే! అన్నం తిన్నపూట పండుగన్నట్టు!!



రైతుబంధు శాన అక్కరకొత్తంది. గతంలో పంట పెట్టుబడి కోసం పైసలు మిత్తీలకు తెచ్చుకునేది. పండిన పంటంతా అప్పు కిందికే పోతుండె. బక్క రైతు కాలం చేస్తే ఆల్ల కుటుంబం ఆగం కాకుండా రైతుబీమా ఆదుకుంటున్నది. ఇట్ల మస్తు చెప్పొచ్చు. మల్లా కేసీఆర్ అస్తనే.. గివన్నీ ఉంటయ్. ఇంతకన్న మంచిగైతయ్.

**ఇప్పుడు చెరువుల పరిస్థితి మారిందా..?**

**నేను** చెప్పుడెందుకు.. కండ్లముందే ఉంది కదా ముచ్చటంతా! తెలంగాణ అచ్చినాంక శాన జరిగినయ్. మా చెరువులు బాగువడ్డయ్. కాల్వలు పూడికలు తీసిన్రు. యాసంగికి కాల్వల నుంచి ప్రాజెక్టు నీళ్లు చెర్లకొస్తున్నయ్. మునుపు వాన కాలంలో కూడ నీళ్లు కనపడని చెరువులు ఇప్పుడు ఎండకాలంలో మత్తడి పోత్తాన్నయ్. ఏ బాయిల జూడు.. నీళ్లు పైకే ఉన్నయ్. మోటర్ ఎయ్యకుండనే బోర్ల కెంచి నీళ్లు దుంకుతన్నయ్.

**కరెంటు సరఫరా మెరుగైన తర్వాత రైతులు ఆశించిన ప్రయోజనం పొందారనుకోవచ్చా?**

**తెలంగాణ** అస్తే కరెంటు ఉండదని కాంగ్రెసోళ్లు చెడ మాట్లాడిన్రు. కానీ, కేసీఆర్ సారు అవన్నీ పిచ్చికూతలని నిరూపించిండు. రాష్ట్రం అచ్చిన ఏడాది సంది కరెంటు 24 గంటలు ఉంటున్నది. ఎప్పుడు కట్క ఏస్తే అప్పుడు బోర్ల నుంచి నీళ్లు దుంకుతున్నయ్. ఇగ రైతులు ఊకుంటరా. ఉన్న భూమిని పొతం చేసిన్రు. ఒక్కొకరు ఎంత భూమి ఉంటే అంత భూమిని సాగు చేస్తున్నరు. బగాయితీలను కూడా కొందరు పొలం చేసిన్రు. రెండు పంటలు పండిస్తున్రు. ఇప్పుడెటు చూసిన పచ్చని పంటలే కండ్లవడ్తున్నయ్. అందరు సంబురంగ ఉన్నరు. సంతోషమనిపిస్తున్నది. తెలంగాణ వస్తే ఏమొస్తదన్నోళ్లు జరిగింది చూసి ముఖం చాటేస్తున్రు.

**వ్యవసాయానికి కరెంటు 24 గంటలు అవసరం లేదు, 3 గంటలిస్తే సరిపోతుందని కాంగ్రెస్ అంటున్నది కదా..?**

**కాంగ్రెసోళ్లకు** కరెంట్ ఇచ్చుడు తెల్వది. అప్పటి పరేషాన్లు మర్సిపోయేటియా! ఆరేడు గంటలిస్తమని చెప్పుంటిరి, రెండుమూడు గంటలొస్తే ఎక్వుంటుండె! మళ్లీ ఇచ్చుడే మూడుగంటలు అని సెప్తున్నరంటె, రెండు గంటలు గిన ఇయ్యరన్నట్టు. మూడు గంటల కరెంటు రైతులకు సరిపోదు. మల్లా ఎన్కటి రోజులు మోపైతయి. ఇరవైనాలుగ్గంటలు ఉండాలె.

...✍ వేముల రాజేశ్వర్ రావు









**ఇటు కొత్త పెట్టుబడుల రాక**

కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో తెలంగాణకు కొత్తగా 25 వేల పరిశ్రమలు వచ్చాయి. రూ.3.3 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. 22.5 లక్షల మందికి ఉపాధి లభించింది.



**అటు పరిశ్రమల మూత**

ప్రధాని మోదీ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో దేశంలో ప్రతిరోజూ 300 పరిశ్రమలకు తాళం పడుతున్నది. అలా ఇప్పటివరకూ 10 లక్షల కంపెనీలు మూతబడ్డాయి.

### థౌజండ్ వాలా..

